సాక్షి
అనకాపల్లి
బుధవారం, 18, డిసెంబర్, 2024



అన్నార్తుల అమ్మ.. లక్ష్మమ్మ

నిరుపేదలకు, దివ్యాంగులకు ఆశ్రయమిస్తున్న వెంకటలక్ష్మమ్మ లలితాదేవి వృద్ధాశ్రమం ద్వారా అమ్మలా సేవలందిస్తున్నారు. 8లో



పునర్వసు నక్షత్ర హోమం

సింహాచలం: పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో హోమం నిర్వహించారు.



కేజీహెచ్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో మంగళవారం ప్రీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'పది' అప్లికేషన్లలో సవరణలకు అవకాశం

అనకాపల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల అప్లికేషన్లు ఆన్‌లైన్లో పొందుపరిచామని, వీటిలో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే సరిచేసుకోవాలని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు గమనించాలన్నారు. సవరణ వివరాలు స్కూల్ రికార్డులు, అపార్ ఐడీ ప్రకారం ఉండాలని ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకూ సరిచేసి అప్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. 2025 మార్చి 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకూ పది పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో దొండపూడి విద్యార్థిని ప్రతిభ



బహుమతితో విద్యార్థిని జ్యోష్యశ్రీదేవాన్షి

చోడవరం: రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన విద్యార్థిని చుక్కల జ్యోష్యశ్రీ దేవాన్షి అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించింది. ఇంటర్నేషనల్ అబాకస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న ఢిల్లీలో అంతర్జాతీయ స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దేశ, విదేశాల నుంచి 10 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏ2 విభాగంలో జ్యోష్యశ్రీదేవాన్షి పాల్గొని ద్వితీయ స్థానం సాధించి ఈ ప్రాంత కీర్తిని అంతర్జాతీయ స్థాయిలో నిలిపింది. ఈమె విశాఖపట్నం సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు లక్ష్మి, స్వామి ఉపాధ్యాయులుగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. విద్యార్థిని జ్యోష్యశ్రీదేవాన్షిని గ్రామస్తులు అభినందించారు.

సోషల్ మీడియా కార్యకర్త రవీంద్రారెడ్డికి బెయిల్ మంజూరు

నర్సీపట్నం: సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డికి మంగళవారం బెయిల్ మంజూరైంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై సామాజిక మాధ్యమంలో వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని ఆయనపై నాతవరం పోలీసు స్టేషన్లో కేసు నమోదైన విషయం తెలిసిందే. నాతవరం మండలం లింగంపేటకు చెందిన టీడీపీ నాయకుడు దేవాడ అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్, ఐటీ చట్టాలను అనుసరించి కేసు పెట్టారు. గుంటూరు జైల్లో రిమాండ్‌లో ఉన్న రవీంద్రారెడ్డిని పీటీ వారెంట్‌పై తీసుకొచ్చిన నాతవరం పోలీసులు ఈ నెల 5న నర్సీపట్నం జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరు పరిచారు. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించడంతో రవీంద్రారెడ్డిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించారు. అదే రోజు న్యాయవాది మాకిరెడ్డి బుల్లిదొర బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. మంగళవారం బెయిల్ మంజూరైంది.

ఏకగ్రీవంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక

నర్సీపట్నం: జిల్లా మేజర్ ప్రాజెక్టు తాండవ జలాశయం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు డీఈ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. తాండవ జలాశయానికి ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా, వీటిలో మూడు అనకాపల్లి జిల్లా, రెండు కమిటీలు కాకినాడ జిల్లాలో ఉన్నాయి. మూడు కమిటీలకు సోమవారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఆర్డీవో వి.వి.రమణ, వ్యవసాయ శాఖ జేడీ మోహన్‌రావు, అనకాపల్లి ఆర్డీవో ఆయిషా, అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా తాండవ డీఈ అనురాధ, ఇరిగేషన్ డీఈ బాలసూర్యం, యలమంచిలి డీఈ ప్రశాంతి వ్యవహరించారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ-1, అధ్యక్షుడిగా పారుపల్లి వరహాలబాబు, ఉపాధ్యక్షుడిగా అప్పన్న కన్నాలదొర(దివానం), డిస్ట్రిబ్యూటరీ కమిటీ-2 అధ్యక్షుడిగా ఎం.జోగిబాబు, ఉపాధ్యక్షుడిగా లాలం గోవింద, డిస్ట్రిబ్యూటరీ కమిటీ-3 అధ్యక్షుడిగా కూలినాయుడు, ఉపాధ్యక్షురాలిగా పల్లెల దేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి ఎన్నికల అధికారులు నియామక పత్రాలను అందజేశారు. కాకినాడ జిల్లాకు సంబంధించి రెండు కమిటీల ఎన్నిక పూర్తయిన తర్వాత జలాశయం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ఉంటుందని డీఈ అనురాధ తెలిపారు.

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో రజత పతకాలు



సూర్య లాస్యంత్

అనకాపల్లి: స్థానిక గవరపాలేనికి చెందిన విద్యార్థి వీరమాచనేని సూర్య లాస్యంత్ ఈ నెల 5న మైసూర్‌లో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో రెండు రజత పతకాలు సాధించాడు. ఈ చిన్నారిని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొంది రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆగని కడుపు కోతలు


బిడ్డను నవ మాసాలు మోసే తల్లిపై కొందరు ప్రైవేటు వైద్యులు కనీస మానవత్వం చూపడం లేదు. సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా ధనార్జన కోసం శస్త్రచికిత్సకే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదవుతున్న కేసులే ఇందుకు ఉదాహరణ. అవసరం లేకపోయినా చేస్తున్న సిజేరియన్ ఆపరేషన్లు పిల్లలు, తల్లుల ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపిస్తున్నాయి.

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో 45 శాతానికి పైగా సిజేరియన్లు
- సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా శస్త్రచికిత్సకే మొగ్గు
- ప్రభుత్వ నిబంధనలు పట్టని ప్రైవేటు యాజమాన్యాలు
- పిల్లలు, తల్లుల ఆరోగ్యంపై ప్రభావం

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాలు ఇలా..

ప్రసవాలు	ప్రభుత్వ	ప్రైవేట్
సాధారణ	4711	1875
సిజేరియన్	2437	1563
మొత్తం	7148	3438

ప్రభుత్వ ఆస్పత్రుల్లో



ప్రైవేటు ఆస్పత్రుల్లో





యలమంచిలి రూరల్:

ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాల తీరు మారడం లేదు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యతనివ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పదేపదే వైద్యులకు సూచిస్తున్నా అవేమీ పట్టని వైద్యులు సిజేరియన్లకే మొగ్గు చూపిస్తున్నారు. కడుపులో బిడ్డ బయటకు రావాలంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు చేయడమే శరణ్యంగా మారింది. కొన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అనధికార వసూళ్లతో ఇటీవల సిజేరియన్లు ఎక్కువగా చేస్తున్నారన్న ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి. కాసుల కోసమే కోతలు కోస్తున్నారన్న విమర్శలు తల్లుల కుటుంబీకుల నుంచి వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు సమకూరడం, ఇక్కడ సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇస్తుండటంతో చాలామంది ప్రసవాల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకే వస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవాల కోసం చేరుతున్నవారి సంఖ్య పెద్ద ఎత్తున పడిపోయింది. దీంతో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు వచ్చిన వారికి సిజేరియన్లు చేస్తూ సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి. మరికొందరు వైద్యులైతే వ్యాపార ధోరణితోనే ఆస్పత్రులు నిర్వహిస్తూ కోతలకే ప్రాధాన్యమిస్తూ సొమ్ము చేసుకుంటున్న తీరు విస్మయం కలిగిస్తోంది. జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యాధికారులతో సమావేశాలు నిర్వహించి సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశాలిస్తున్నా ఆశించిన ఫలితం కనిపించడంలేదు.

ధనార్జనే ధ్యేయంగా..

ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చిన గర్భిణికి సాధారణ ప్రసవం చేసేందుకు ప్రయత్నించాలని.. అత్యవసరమైతే తప్ప శస్త్రచికిత్స ద్వారా ప్రసవం చేయాలని ప్రభుత్వ ఆదేశాలను ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు పట్టించుకోవడంలేదు. మహిళల ఆరోగ్యం ఏమైతే తమకేంటనే ఉద్దేశంతో ధనార్జనే ధ్యేయంగా శస్త్రచికిత్సలు చేస్తున్నారు. సాధారణ కాన్పులు చేయడం ద్వారా తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, అందులోనూ మొదటి కాన్పును కచ్చితంగా సాధారణమే చేయాలని, ఒకవేళ సిజేరియన్ ద్వారా కాన్పు చేస్తే అందుకు తగిన కారణాలను ప్రైవేట్ ఆస్పత్రులు చెప్పాల్సి ఉంటుంది.

మహిళల ఆరోగ్యంపై ప్రభావం

సిజేరియన్లతో మహిళలు భవిష్యత్తులో పలు రకాల అనారోగ్య సమస్యలకు గురవుతారు. ఆపరేషన్ చేసిన ప్రదేశంలో గాయం మానకపోవడం, అనస్థీషియా సమస్యలు, తల్లి కోలుకునే వరకు ఎక్కువ సమయం పట్టడం, మరీ ముఖ్యంగా శస్త్రచికిత్స సమయంలో ఎక్కువ మొత్తంలో రక్తం పోవడం జరుగుతుంటాయి. అలాగే గర్భాశయ ఇన్‌ఫెక్షన్లకు గురవుతుంటారు.

ఇలాంటి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ల ద్వారా జరిగే ప్రసవాలపై జిల్లా అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

అవగాహన కరువు..

సాధారణ ప్రసవాలపై గర్భిణుల్లో అవగాహన ఉండడం లేదు. సాధారణ ప్రసవాల వలన కలిగే లాభాలు, ఆరోగ్య పరిస్థితి, సిజేరియన్ల వలన వచ్చే సైడ్ ఎఫెక్టులు ఇతర ఆరోగ్య సమస్యలపై ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్యులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు. సిజేరియన్ ఆపరేషన్‌లను ప్రోత్సహిస్తున్న ఆస్పత్రులపై తగిన చర్యలు తీసుకుంటే తప్ప సాధారణ ప్రసవాలు పెరిగే అవకాశం ఉండదని కొందరు విశ్రాంత వైద్యులు అంటున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లోనే చేయాలి



ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యమివ్వాలి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్లు చేయాలి. సిజేరియన్లు అధికంగా చేస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా పెట్టాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య మరింత పెంచేందుకు కృషి చేస్తున్నాం. ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను సద్వినియోగం చేసుకోవాలి. కారణం లేకుండా డబ్బు ఆశతో శస్త్రచికిత్సలు చేస్తే కఠినమైన చర్యలు తప్పవు.

–డాక్టర్ ఎంఎస్‌వీకే బాలాజీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

రెవెన్యూ రాజకీయ సదస్సా?

అధికారులకు కుర్చీల్లేకుండా కూర్చున్న కూటమి నేతలు

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల అనుచరులతో నిండిపోయిన కలెక్టరేట్
- సమస్యలు తెలిపేందుకు ఇబ్బంది పడిన రెవెన్యూ అధికారులు
- సదస్సుకు దూరంగా ఎమ్మెల్యే గంటా



వెనుక వరుసలో కూర్చొన్న కూటమి పార్టీల ద్వితీయ శ్రేణి నేతలు

సాక్షి, విశాఖపట్నం: జరిగిందేమో ఉత్తరాంధ్ర జిల్లాల రెవెన్యూ సదస్సు.. సమావేశ మందిరంలో కనిపించిందేమో కూటమి పార్టీల దిగువస్థాయి నేతలు. అధికారులు కూర్చునేందుకు చోటు లేకపోయినా.. మేం బయటికి వెళ్లం.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటే మేమూ కూడా అంటూ సదస్సు ఆద్యంతం ఉన్నారు. తామంతా రెవెన్యూ సదస్సుకు వచ్చామా.? కూటమి నేతల రాజకీయ సదస్సుకు వచ్చామా అనే సందేహంతోనే రెవిన్యూ అధికారులు రోజంతా కాన్ఫరెన్స్‌లో సర్దుకొని కూర్చున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డీవోలతో కలెక్టరేట్ సమావేశమందిరంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ పరిధిలో సమస్యలు పరిష్కారం, భూముల రీ సర్వే, 22ఏ, ఫ్రీ హోల్డ్, గ్రామ సభలు, పీజీఆర్ఎస్.. తదితర అంశాలపై సమీక్షలో చర్చించారు. ఈ సదస్సుకు మంత్రులు, అధికారులతో పాటు ఆయా జిల్లాల ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు మాత్రమే పాల్గొనే అవకాశం ఉంది. ఇంకెవరూ ఆ సదస్సులో ఉండటానికి అర్హులు కారు. కానీ.. కాన్ఫరెన్స్‌లో అధికారులకు సైతం చోటు లేకుండా.. కూటమి పార్టీల నేతలతో హాల్ నిండిపోయింది. ఒకానొక సమయంలో ఆర్డీవోలకు చోటు లేకపోవడంతో.. మళ్లీ కుర్చీలు తెచ్చి సర్దుకోవాల్సి వచ్చింది. ఇంత జరుగుతున్నా.. తమ అనుచరుల్ని బయటకు వెళ్లమని మంత్రులు గానీ, ఎమ్మెల్యేలు గానీ చెప్పలేదు. సమావేశానికి ఆహ్వానం లేని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, నామినేటెడ్ పోస్టు హోదాలో ఉన్న సీతంరాజు సుధాకర్, జనసేన చోటా నాయకుడు చంద్రరావు, బీజేపీ నేత శ్రీరామమూర్తి.. ఇలా దిగువ స్థాయి నేతలంతా హాల్‌లోనే ఆద్యంతం ఉన్నారు. ఎమ్మెల్యేలు తమ పరిధిలో ఉన్న వ్యవహారాలపై మాట్లాడుతుంటే.. చోటా నాయకులు మధ్యలో కలగజేసుకొని మాట్లాడుతుండటంతో అధికారులు అసహనం వ్యక్తం చేశారు. తమ పరిధిలో కూటమి నేతల వల్ల ఎదురవుతున్న సమస్యలు మంత్రి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా దృష్టికి తీసుకెళ్లాలని భావించినా.. జిల్లా, మండల స్థాయి నాయకులు సదస్సులో ఉండటంతో.. వారి వ్యవహారాలు బయటపెట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొత్తంగా రెవెన్యూ సదస్సును కూటమి నేతలు రాజకీయ సదస్సుగా మార్చేశారు. ఇదిలా ఉండగా.. కీలకమైన సదస్సుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు డుమ్మా కొట్టారు. రెవెన్యూ విభాగంలో తన మాట చెల్లుబాటు కాకపోవడంతోనే గంటా గైర్హాజరైనట్లు కూటమి నేతలే చెబుతుండటం కొసమెరుపు.

మన్యంపై చలి పంజా 8లో

చెరకు బకాయిలు చెల్లించకపోతే ఉద్యమిస్తాం

- వైఎస్సార్‌సీపీ హయాంలోనే రైతులను ఆదుకున్నాం
- మాజీ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న మాజీ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: సంక్రాంతిలోగా చెరకు రైతుల బకాయిలు చెల్లించకపోతే ఆందోళనకు దిగుతామని మాజీ విప్ కరణం ధర్మశ్రీ హెచ్చరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు క్రషింగ్ సీజన్ నాటికి రైతులకు చెరకు బకాయిలన్నీ చెల్లించే వాళ్లమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటికీ గతేడాది చెరకు బకాయిలు టన్నుకు రూ. 350 చొప్పున చెల్లించలేదన్నారు. గేటు ఏరియాకి సరఫరా చేసిన రైతులకు అదనంగా టన్నుకు మరో రూ. 50 చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. వీటితో పాటు కార్మికుల జీతభత్యాల బకాయిలు రూ. 15 కోట్లు చెల్లించాలన్నారు. ఫ్యాక్టరీలో గతేడాదికి సంబంధించిన మొలాసిస్, పంచదార, కరెంటు అమ్మితే రూ. 9 కోట్లు వస్తాయని, రూ.6 కోట్లు మాత్రమే ప్రభుత్వం గ్రాంట్‌గా ఇస్తే సరిపోతుందని చెప్పారు. చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు ప్రభుత్వం నుంచి ఈ మొత్తం తెచ్చి వెంటనే రైతులకు, కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. 2019కి ముందు టీడీపీ హయాంలో రూ. 170 కోట్లు మేర రుణాల ఊబిలో కూరుకుపోయిన ఫ్యాక్టరీపై భార పడకుండా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రూ.130 కోట్లు వరకూ తీర్చిందన్నారు. అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెరకు బకాయిలు, కార్మికుల జీతభత్యాలు చెల్లించేందుకు ఏటా రూ. 8 కోట్లు నుంచి రూ.15 కోట్లు వరకూ ఇచ్చారన్నారు. రూ.90 కోట్లు గ్రాంటుగా తెచ్చామని చెప్పారు. ఏటా క్రషింగ్‌ను ఈ నెల 15వ తేదీలోపే ప్రారంభించేవారమని, ఈ ఏడాది ఇంతవరకూ ప్రారంభించే పరిస్థితి కనిపించలేదన్నారు. ముందుగా క్రషింగ్ ప్రారంభిస్తే, శీతాకాలంలో చెరకులో రస నాణ్యత బాగుండి మంచి దిగుబడి వస్తుందని, రైతులకు, ఫ్యాక్టరీకి మేలు కలుగుతుందన్నారు. గత మహాజన సభలో గత ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటు కంటే ఒక్క రూపాయి అయినా అదనంగా తెస్తామని చెప్పిన చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు ఇప్పటి వరకూ తేలేదన్నారు. దీనిపై జిల్లా మంత్రులు, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు, అధికారులు చొరవ తీసుకొని సంక్రాంతి లోగా రైతులకు పాత బకాయిలన్నీ చెల్లించాలన్నారు. ఈ విషయమై రైతులతో కలిసి ఫ్యాక్టరీ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా కలెక్టర్‌కు, ఫ్యాక్టరీ ఎండీకి వినతిపత్రం ఇస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా నర్సింగరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంపలి ఆనందీశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, ఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగులాపల్లి రాంబాబు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, యూత్ అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రమాదాల నియంత్రణలో

పోలీసులు కీలకం

- పోలీసులకు మూడు రోజుల పాటు ఫైర్ సేఫ్టీలో శిక్షణ
- ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్ సిన్హా



మాట్లాడుతున్న అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా

పరవాడ: పరిశ్రమల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాల పట్ల పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఫార్మాసిటీలో ఎంఏఎస్‌ఎం సమావేశ మందిరంలో జిల్లా పోలీసులకు ఫైర్ సేఫ్టీపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఎస్పీ మంగళవారం ప్రారంభించి, మాట్లాడారు. అత్యవసర సమయాల్లో అగ్నిప్రమాదాల నుంచి ప్రాణాలను రక్షించే శిక్షణలో పోలీసులు ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ప్రమాదాలు సంభవించే సమయంలో ప్రజలు పోలీసులనే ఆశ్రయిస్తారని అందువల్ల పరిశ్రమల్లో జరిగే అగ్ని ప్రమాదాల నివారణపై పోలీసులు కూడా ప్రత్యేక శిక్షణ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సరైన శిక్షణ లేకపోతే ఇతరులను రక్షించలేకపోవడమే కాకుండా తమ ప్రాణాలకూ ముప్పు కలుగుతుందన్నారు. అందుకే ఫైర్ సేఫ్టీపై పోలీసు యంత్రాంగం అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమల్లో గ్యాస్ లీకేజీ, బాయిలర్ పేలుళ్లు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నందున వాటికి తగ్గ నియంత్రణ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఏ విధంగా పని చేస్తుందో.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా లారస్ ల్యాబ్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్(సేఫ్టీ) శ్రీనివాస్ అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమంలో అనకాపల్లి సబ్‌డివిజన్, నర్సీపట్నం, పరవాడ సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా ఆర్మ్‌డ్, రిజర్వ్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంతో

పక్కాగా దిగుబడి అంచనా

- జిల్లా డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ వైకుంఠరావు



వరి పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ వైకుంఠరావు

దేవరాపల్లి: పంట కోత ప్రయోగాన్ని పారదర్శకంగా చేయడం ద్వారా వరి సాగులో దిగుబడిని పక్కాగా అంచనా వేయడం సాధ్యపడుతుందని జిల్లా డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ జి.వైకుంఠరావు అన్నారు. తామరబ్బ పంచాయతీ చినసోంపురం గ్రామంలో ప్రధా నమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా వరి పంట కోత ప్రయోగాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక పంట పొలంలో 5 మీటర్ల పొడవు, వెడల్పు మధ్య వరి పొలాన్ని తీసుకొని సదరు పొలం దిగుబడి వచ్చిన ధాన్యాన్ని బరువు తూసి దిగుబడిన అంచనా వేశారు. స్థానిక రైతుకు చెందిన శ్రీకాకుళం సన్నాలు రకం వరి పొలంలో 15.20 కేజీల దిగుబడి వచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ, మండల విస్తర్ణాధికారి ఎస్.కిరణ్‌కుమార్, ఉద్యానవన సహాయ అధికారి డి.వరుణ్‌కుమార్, బీమా ఏజెంట్ సిహెచ్.వాసు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



మన్యంపై చలి పంజా



చలి మంట కాగుతున్న గిరిజనులు

అరకు వ్యాలీలో 5.3, జి.మాడుగులలో 6.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

చింతపల్లి: మన్యంలో రోజురోజుకు చలితీవ్రత పెరుగుతోంది. మంగళవారం అరకువ్యాలీలో 5.3 డిగ్రీలు జి మాడుగులలో 6.2 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయినట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. అదేవిధంగా పాడేరు డివిజన్ పరిధిలోని జీకేవీధిలో 7.2, హుకుంపేటలో 7.4, చింతపల్లిలో 7.5, ముంచంగిపుట్టు, పెదబయలులో 9.7,అనంతగిరిలో 10.3, కొయ్యూరులో 12.1 డిగ్రీల చొప్పున నమోదయ్యాయని ఆయన వివరించారు. రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు మరింత కనిష్ట స్థాయికి చేరుకోవడంతో సాయంత్రం 4 గంటల నుంచి చలి గాలులు వీస్తున్నాయి. దీంతో ఉన్ని దుస్తులు లేకుండా బయటకు రాలేకపోతున్నారు. సాయంత్రం వేళల్లో చలిగాలుల నుంచి ఉపశమనం పొందేందుకు చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు.

చిరుజల్లుల్లా మంచు

ఎటపాక: మండలంలో చలి ప్రభావం ఎక్కువగా ఉంది. నాలుగు రోజుల నుంచి మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జామునుంచి మంచు తుంపరలు చిరు జల్లులను తలపిస్తున్నాయి. ఉదయం 10 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు.

ఖోఖో రాష్ట్ర జట్టు సభ్యులకు క్రీడా దుస్తుల పంపిణీ



ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు

అనకాపల్లి: విద్యార్థులు క్రీడా కోటలో ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగావకాశాలు సాధించవచ్చని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. తుమ్మపాల ప్రభుత్వ హైస్కూల్లో ఏపీ నుంచి జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులకు ఏకరూప క్రీడా దుస్తులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీలు (అండర్–19) ఈనెల 21 నుంచి 24 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో జరుగుతాయని చెప్పారు. రాష్ట్ర జట్టులో మన జిల్లా బాలబాలికలు పలువురు పాల్గొంటున్నారని ఆయన చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. హెచ్ఎం ఉమ, విద్యాకమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం, జిల్లా స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు. రాష్ట్ర జట్టు సభ్యులు విశాఖ నుంచి అయోధ్య బయలుదేరారు.

అమ్మలకే అమ్మ...
అయిన వారు రోడ్డున పడేస్తే అక్కున చేర్చుకుని
ఆలనాపాలనా చూస్తున్న అమ్మమ్మ..
జీవిత చరమాంకంలో ఒకరి నీడన బతకాల్సినామె
ఎంతోమంది అన్నార్తులకు ఆశ్రయమిచ్చి ఆకలి
తీరుస్తోంది. అంతా లక్ష్మమ్మ అని ముద్దుగా పిలుచుకునే ఆమే... యాళ్ల వెంకటలక్ష్మి.



ఆశ్రమంలో భోజనం చేస్తున్న దివ్యాంగులు

అన్నార్తుల అమ్మ.. లక్ష్మమ్మ

- నిరుపేదలకు, దివ్యాంగులకు ఆశ్రయం
- తనలాంటి వృద్ధులకు ఆలనాపాలన
- అప్పలరాజుపురంలో లలితాదేవి వృద్ధాశ్రమంలో 42 మందికి సేవ
- ఆదర్శంగా నిలుస్తున్న నిర్వాహకురాలు వెంకటలక్ష్మి

చీడికాడ:

అప్పలరాజపురం వృద్ధాశ్రమం నిర్వాహకురాలు యాళ్ల వెంకటలక్ష్మి ధనానికి నిరుపేదరాలైనా గుణంలో కోటీశ్వరాలే.. పేగుబంధం తెంచుకుని వీధిన పడేస్తున్న తల్లిదండ్రులను ఆదరించి ఆదర్శంగా నిలుస్తోంది. మండలంలోని ఖండివరానికి చెందిన వెంకటలక్ష్మి తన చిన్ననాటి నుంచి సత్యసాయిబాబాను ఇష్టదైవంగా కొలుస్తోంది. తన కన్నవారు, కట్టుకున్న వాడు, కడుపున పుట్టిన వారి నుంచి మోసానికి గురై ఉన్న కాస్తా ఆస్తిని పోగొట్టుకుని ఆదరించేవారు లేక సత్యసాయిబాబా సజీవంగా ఉన్నంత కాలం ఏటా పుట్టపర్తి సేవకు వెళ్లేది. ఆయన శివైకం పొందే ముందు నీ చుట్టూ ఉన్న అభాగ్యులకు సేవ చేయండి.. ఇక్కడకు వచ్చే ఖర్చులను వారికి ఖర్చు చేయమని చెప్పిన మాటలు స్ఫూర్తిగా తీసుకుని 2011లో నలుగురు వృద్ధులతో అప్పలరాజుపురంలో లలితాదేవి వృద్ధాశ్రమాన్ని నెలకొల్పింది. ప్రస్తుతం 42 మంది వృద్ధులు, దివ్యాంగులు ఆశ్రయం పొందుతున్నారు. 60 ఏళ్ల వయసులో ఒకరి నీడన తల దాచుకోవాల్సిన వెంకటలక్ష్మి తన ఆశ్రమంలో వారికి తిండి పెట్టడానికి రోజూ బియ్యం సేకరణ, దాతల సహకారం కోసం గ్రామాలకు వెళ్తోంది. అలా సేకరించిన బియ్యంతో అన్నం పెట్టి వారి ఆకలి తీరుస్తోంది. ఆశ్రయం నెలకొల్పిన 13 ఏళ్లలో 70 మంది వృద్ధులు, దివ్యాంగులు మరణిస్తే వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించింది. సహకారం అందిస్తారని తెలిస్తే, ఏ సమయంలోనైనా, ఎంత దూరమైనా వెళ్తోంది. అంతేకాకుండా ఆశ్రయం పొందిన అనాథలకు తన ప్రాణాలను సైతం ఒడ్డి కాపాడుతోంది. నాలుగేళ్ల క్రితం కుటుంబ సభ్యుల నుంచి వెలివేతకు గురైన కరోనా పాజిటివ్‌తో బాధపడుతున్న ఒక గర్భిణికి ఆశ్రయం ఇచ్చింది. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో నెలలు నిండిన ఆమెకు నొప్పులు రావడంతో దిక్కుతోచని స్థితిలో అందరినీ సహాయం చేయాలని కోరింది. ఎవరూ సహకరించలేదు. చివరకు గ్రామంలో వైద్య సిబ్బంది పట్టించుకోక పోవడంతో పురుడు పోసి ప్రాణాలు నిలిపింది. ప్రస్తుతం ఆశ్రయం పొందిన వారిలో ఒడిశా, రాజమహేంద్రవరం, పెద్దాపురం, ముమ్మిడివరం, రాజానగరం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, పాడేరు, మాడుగుల, చోడవరం ప్రాంతాలకు చెందిన వృద్ధులు ఉన్నారు. వీరిలో ఒడిశాకు చెందిన ఒక బధిర (మూగ, చెవుడు) మహిళను కొత్తకోట పోలీసులు ఆశ్రమానికి అప్పగించారు.

ఆవుల పాల అమ్మకాలతో ఆశ్రమ నిర్వహణ

దాతల సహకారంతోపాటు ఆశ్రయంలో ఆరు ఆవులను వెంకటలక్ష్మి పెంచుతోంది. వాటి ద్వారా వచ్చే పాలను ఆశ్రమంలో అవసరాలకు వినియోగించగా, మిగిలిన పాలను డైయిరీకి పోసి వచ్చిన డబ్బులను ఆశ్రమం నిర్వహణకు వెచ్చిస్తోంది.



లలితాదేవి వృద్ధాశ్రమం



ఆశ్రమంలో పెంచుతున్న ఆవులు

స్థలం కేటాయిస్తే మరింత మందికి సేవలందిస్తా..



ప్రస్తుతం ఆశ్రమ స్థలం సరిపోవడం లేదు. ఆశ్రమాన్ని ఆనుకుని కొంత ప్రభుత్వ స్థలం ఉంది. దాన్ని ఆశ్రమానికి కేటాయిస్తే మరింత మందికి సేవలందిస్తాను. అంతే కాకుండా ప్రతి వ్యక్తి తన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో కాస్త చోటునిచ్చి ఆదుకోవాలి. అలా జరిగిన నాడు నాలాంటి వారికి ఇలాంటి ఆశ్రమాల అవసరం ఉండదు.

– **యాళ్ల వెంకటలక్ష్మి**, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు, లలితా వృద్ధాశ్రమం, అప్పలరాజపురం

మా చివరి రోజులు ఆశ్రమంలోనే...



మాది విశాఖపట్నంలోని కైలాసపురం. మాకు మగబిడ్డలు లేరు. ఉన్న ఆస్తితో ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేశాం. ఇంక ఆరోగ్యం సహకరించలేదు. నా భర్తతోపాటు నన్ను చూసే దిక్కులేక ఆరేళ్ల క్రితం ఆశ్రమంలో చేరాం. ఇక్కడ ఏ బెంగ లేకుండా గడుపుతున్నాం. ఏడాది క్రితం మా ఆయన నారాయణమూర్తి అనారోగ్యంతో మరణించాడు. ఆశ్రమంలో ఉన్న నాలాంటి వారికి చేతనైన సేవ చేస్తూ అంతా కుటుంబ సభ్యులుగా మెలుగుతున్నాం.

– **బమిడిశెట్టి జయలక్ష్మి**, విశాఖపట్నం

సొంతింట్లో ఉన్నట్లే సంతోషంగా..



మేము వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారం. మా పిల్లలు మమ్మల్ని పట్టించుకోక పోవడంతో పూట గడవడం కష్టంగా మారింది. ఆయన అనారోగ్యం బారిన పడడంతో తిండి లేక ఇబ్బంది పడ్డాం. మమ్మల్ని ఆశ్రమం ఆదుకుంది. నేడు మేం మా సొంత ఇంట్లో ఉన్నట్లే సంతోషంగా జీవిస్తున్నాం. తిండికి ఇబ్బంది లేకుండా పోయింది.

–**కాళ్ల లక్ష్మి, అర్జున** (భార్యాభర్తలు), ఘాట్‌రోడ్డు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయము, ఉపమాక
టెండరు ప్రకటన

Roc.No.TTD-94021(31)/82/2023-DYEOVJT-SEC TTD

ఒక (01) సంవత్సర 2025–26 కాల పరిమితిలో నిత్యం 10 కిలోల పూల మాలలు కోసం టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూల్ ధర మరియు E.M.D వివరాల కోసం సంప్రదించు ఫోన్ నెంబర్: 9959329089.

టెండర్ తెరవడం తేది: 24.12.2024 ఉదయం 11.00 గంటలకు

Roc No:TTD-40021(31)/1/2024-PRO SEC(Adv No.262) Dt: 17.12.2024 కార్యనిర్వహణాధికారి

అధిక కమీషన్ ఆశ చూపి రూ.55 లక్షలకు టోకరా

- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో పెట్టుబడి పేరుతో స్నేహితుడి మోసం
- మునగపాక పోలీసులకు బాధితుడు ఫిర్యాదు

మునగపాక: అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో పెట్టుబడి పెడితే అధిక లాభం వస్తుందని నమ్మించి మోసగించిన స్నేహితుడిపై మునగపాకకు చెందిన కొయిలాడ తులసీరావు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మునగపాక గ్రామానికి చెందిన సబ్బి శివగణేష్, కొయిలాడ తులసీరావు స్నేహితులు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో వస్తువులు తక్కువ ధరకు వస్తున్నాయని, దీంతో వాటిని విక్రయించి అధిక ఆదాయం పొందవచ్చని తులసీరావుకు శివగణేష్ ఆశ చూపాడు. మొదటిగా రూ.లక్ష పెట్టి రిఫ్రిజిరేటర్, ఏసీ, వెల్డింగ్ మిషన్ కొనుగోలు చేయగా.. రూ.30 వేల లాభం వచ్చిందని, అలాగే ఇద్దరూ భాగస్వామ్యంతో మరో రూ.3 లక్షలు పెట్టుబడితో వస్తువులు కొనుగోలు చేయగా రూ.50 వేలు లాభం వచ్చినట్లు శివగణేష్ తన స్నేహితుడు తులసీరావుకు చెప్పుకొచ్చాడు. ఈ వ్యాపారం బాగుందని నమ్మిన తులసీరావు అత్యాశకు పోయాడు. ఈ క్రమంలో దఫదఫాలుగా రూ.6 లక్షలు, రూ.8 లక్షలు, రూ.15 లక్షలు, రూ.36 లక్షల మేర తులసీరావు ఇతరుల నుంచి అప్పు చేసి మరీ శివగణేష్‌కు ఇచ్చాడు. మధ్యలో కొంత లాభం వచ్చిందంటూ ఇద్దరూ పంచుకున్నారు. ఆ తరువాత నెలలు గడుస్తున్నా కమీషన్ రాకపోవడంతో తులసీరావు ఆందోళనకు గురై శివగణేష్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా.. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. ఆయన హైదరాబాద్ వెళ్లిపోయినట్లు తెలుసుకుని లబోదిబోమంటూ మునగపాక పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు నిందితుడు గణేష్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సుమారు రూ.55 లక్షల మేర మోసపోయానంటూ బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE
■ SAI GOLDEN VENTURE VZM Local Muncipal Area VMRDA & RERA Approved Project only 38 lakhs 2BHK,3&4BHK, 80% Bank loan, open Plots Also Available. Cont. 9391873337, 8143333494. [S-1244405]

Services

BUSINESS OFFER
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర।। 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

Wanted

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256007]

■ WANTED Female Teachers for LKG, UKG & Classes 1st to 3rd Std. English Fluency is must. Expected Salary: 10,000/-+, Based on Experience & Qualification. Contact: 91608 66003. Old Post office. [V- 823897]

■ వైజాగ్‌లో గల ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18–35 వయస్సు గల యువకులు కావలెను. జీతం : 10,000-13,500 + ఫుడ్ రూమ్, ట్రాన్స్‌పోర్ట్ సదుపాయం కలదు. ఫోన్ : 97051 94330, 99499 04532 [V- 26465]

■ MESS లో పనిచేయుటకు స్త్రీలు కావలెను. ♦ వంట మాస్టర్, ♦ అసిస్టెంట్ వంట మాస్టర్ (F) కావలెను. ఫోన్ : 81794 39944 [V- 1368]

■ ఫర్నిచర్ డెలివరి ఆటో నడుపుటకు డ్రైవర్స్ కావలెను. (జీతం: 16,000/-) & హెల్పర్స్ కావలెను. ఫోన్: 77299 49079. [V- 13033]

■ ప్రముఖ ఎయిర్‌లైన్ డొమెస్టిక్ ఇంటర్‌నేషనల్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు గ్రౌండ్ స్టాఫ్, టికెటింగ్ ఎగ్జిక్యూటివ్, టీం లీడర్స్, కార్గొలోడర్స్ కావలెను. స్త్రీ/పు. శా:23k-28k, Q:10th, డిగ్రి, ITI డిప్లొమా, వ: 18–35లోపు. 8187039562 [G-1911]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి, ఫుడ్ జీ: 18K. Ph: 9640400073, 9160900024 [SCA24000833]

■ MS Pvt Ltd నందు టెలికాలింగ్ చేయుటకు పార్ట్ టైమ్/ఫుల్ టైమ్, మేల్/ ఫీమేల్ కావలెను. Qly: 10th, జీతం : 16000 to 18000, Ph: 7416297427/9550853907 [HA-970]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

ఆంజనేయ వాహనంపై వెంకన్న తిరువీధి



ఆంజనేయ వాహనంపై స్వామికి తిరువీధి సేవలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం స్వామివారికి ఆంజనేయ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. గరుడాద్రిపై వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు ఉదయం పూజలు, నిత్యార్చనలు, అభిషేకాలు చేశారు. కొండ దిగువన ఉత్సవమూర్తులకు, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామివారికి, గోదాదేవి అమ్మవారికి నిత్య పూజాది కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామిని ఆంజనేయ వాహనంలోను, గోదాదేవి అమ్మవారిని పెద్ద పల్లకిలో ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో రెండో పాశురం విన్నపంతో ప్రత్యేక నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో ప్రముఖ కవయిత్రి, విశ్రాంత తెలుగు పండిట్ డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు, సాయి ఆచార్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

తులసి గౌడ పేరిట మొక్కల పంపిణీ

- అదే ఆమెకు అసలైన నివాళి
- వృక్షమిత్ర సమితి అధ్యక్షుడు రాంబాబు

రోలుగుంట: లక్ష మొక్కలు నాటి పద్మశ్రీ అవార్డు అందుకున్న కర్ణాటకకు చెందిన పర్యావరణ వేత్త తులసీ గౌడ మృతికి నర్సీపట్నం వృక్షమిత్ర సమితి అధ్యక్షుడు, కుసుర్లపూడి జెడ్పీ ఉన్నత సోషల్ టీచర్ అప్పన రాంబాబు మంగళవారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులసీ గౌడను ఆదర్శకంగా తీసుకుని ఆమె పేరిట మొక్కలు పంపిణీ చేస్తానన్నారు. అదే ఆమెకు నిజమైన నివాళి అని చెప్పారు. లక్ష మొక్కలు నాటి 'మదర్ ఆఫ్ ట్రీ'గా పేరు తెచ్చుకున్నారన్నారు.

కోనాం రెవెన్యూ సదస్సు వద్ద ఆందోళన

చీడికాడ : కోనాం పంచాయతీ పరిధిలో ఉన్న భూములను ఆదివాసీలు తరతరాలుగా సాగు చేసుకుంటున్నారని ఆ భూములు సాగుబడి రిజిస్టరులో నమోదు చేయడం లేదని గిరిజనులు కోనాంలో ధర్నా చేపట్టారు. కోనాం సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తహసీల్దారు ప్రసాదరావు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సదస్సుకు కోనాం పంచాయతీ శివారు గ్రామాల నుంచి ఆదివాసీ గిరిజన రైతులు పాల్గొన్నారు. ఏపీ ఆదివాసీ సంఘం గౌరవ సలహాదారు పి.ఎస్.అజయ్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ కోనాం శివారు గుడివాడ, వాకపల్లి, జాజులపాలెం గ్రామాల్లో ఆదివాసీలు చేస్తున్న భూమి సాగుబడి నమోదు కావడం లేదని, 1998లో చేసిన ఉద్యమం ఫలితంగా నాటి జాయింట్ కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని, వారి పేర్లు నమోదు చేశారని అన్నారు. ఇప్పుడు మరలా ఆ పేర్లు గల్లంతయ్యాయని అన్నారు. కోనాం శివారు కొత్తవీధి గ్రామంలో కోందు ఆదివాసీలు సర్వే నంబరు 289లో గ్రామం నిర్మించుకుని సాగు అనుభవంలో వున్నారని, వీరితో పాటు గుంటి గ్రామ ఆదివాసీలు కూడా జీడిమామిడితోటలు పెంచారని అన్నారు. ఈ సర్వే నెంబరుపై విచారణ నిర్వహించి ఎంజ్మాంట్ రిపోర్టు ఇవ్వాలని ఐటీడీఏ పీవో స్థానిక ఆర్డీఓను ఆదేశించారని, భూమి శిస్తు కమిషనర్ కూడా ఆదేశాలు ఇచ్చారని కానీ నేటి వరకు ఎలాంటి నివేదిక పంపించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘ ప్రతినిధులు జన్ని లక్ష్మణరావు, దయారావు, రాంబాబు, చంటి, భీము నాయుడు పాల్గొన్నారు. తహశీల్దారు ప్రసాదరావుకు వినతిపత్రం అందజేశారు. ఇలా ఉండగా రెవెన్యూ సదస్సులో సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, రెడ్డి దేముడునాయుడు కలిపి పంచాయతీ పరిధిలో గల భూ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.



సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజన రైతులు

ఆడపిల్ల పుట్టిందని వేధింపులపై ఫిర్యాదు

మునగపాక: అదనపు కట్నంతో పాటు ఆడపిల్ల పుట్టిందన్న నెపంతో తన భర్త ఇల్లు విడిచి వెళ్లిపోయాడని ఓ వివాహిత మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేశారు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వాడ్రాపల్లికి చెందిన అనసూరి లక్ష్మీనారాయణతో నూకరత్నంకు 2022లో వివాహమైంది. వీరికి ఓ ఆడపిల్ల పుట్టింది. ఆడపిల్ల పుట్టిందని, ఇందు కోసం అదనపు కట్నం తేవాలంటూ భర్తతో పాటు అత్త అప్పలనరస తరచూ వేధించడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం తన భర్త లక్ష్మీనారాయణ తనను, తన కుమార్తెను విడిచి ఎక్కడికో వెళ్లిపోయాడని, తనకు న్యాయం చేయాలని కోరుతూ నూకరత్నం పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కోళ్ల వ్యర్థాల నియంత్రణలో అధికారుల చోద్యం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



కోళ్ల వ్యర్థాలతో పట్టుబడిన వ్యాన్ ఇదే..

దేవరాపల్లి: చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాల తరలింపును అడ్డుకోవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న విమర్శించారు. దేవరాపల్లిలో మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. గతంలో కోళ్ల వ్యర్థాలతో వ్యాన్‌ను అధికారులకు అప్పగించగా, మొక్కుబడిగా జరిమానా విధించి విడిచి పెట్టడంతో చేపల పెంపకదారులు మరింత రెచ్చిపోతున్నారన్నారు. తాజాగా కోళ్ల వ్యర్థాలతో మరో వ్యాన్‌ను అధికారులకు అప్పగించామని, అయితే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా మత్స్యశాఖ అధికారులు అలసత్వాన్ని వీడి కేసు నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కోళ్లు, గొర్రెలు, మేకల మాంసాలతో పాటు హోటళ్లలో వ్యర్థాలతో విచ్చలవిడిగా చేపలు పెంచుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వరి కోతలు వాయిదా వేసుకోండి

- ఆర్ఏఆర్ఎస్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న టి.శ్రీలత

అనకాపల్లి : వర్ష సూచన ఉన్నందున్న, వరి కోతలను వాయిదా వేసుకోవాలని, ఒక వేళ ఇప్పటికే పైరును కోసి ఉంటే కుప్పలుగా పెట్టుకుని టార్పాలిన్ పరదా కప్పాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఇన్‌ఛార్జ్ ఏడీఆర్ టి.శ్రీలత అన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాల అనంతరం 12–14 రోజుల వయసుగల రబీలో వేసిన వరిలో 2.5 కిలోల యూరియాను వేసుకోవాలని, నారును పీకే వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలను 5 సెంట్ల నారుమడికి 800 గ్రా.చొప్పున వేసుకోవాలన్నారు. వర్ష సూచన ఉన్నందున రాగులు, మొక్కజొన్న, నువ్వులు, అపరాలు, వేరుశనగ వంటి రబీపైరులను విత్తుకోవడం వాయిదా వేసుకోవాలని, వర్షాల అనంతరం తేమను ఉపయోగించుకుని పైరులను వేసుకోవచ్చన్నారు. ఒక వేళ ఇప్పటికే రబీ పంటలు వేసిన వర్షాల వల్ల పొలంలో నీరు చేరినట్టయితే బయటికి తీసే ఏర్పాటు చేయాలన్నాని చెప్పారు. కూరగాయ పంటల్లో కూడా అధిక నీరు చేరినట్టయితే వీలైనంత త్వరగా నీటిని బయటికి తీసివేయాలని, కుళ్లు తెగుళ్లు రాకుండా నివారణ చర్యగా కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి 3 గ్రా.చొప్పున కలిపి మొక్కల మొదళ్ల వద్ద నేల తడిచేల పిచికారి చేయాలన్నారు. వీలైనంత త్వరగా పక్వతకు వచ్చిన కూరగాయలను కోసి మార్కెట్‌కు తరలించాలన్నారు.

ఫిబ్రవరిలోగా పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్ సమర్పణ



మాట్లాడుతున్న ఖజానా శాఖ అధికారి సుభాషిణి

అనకాపల్లి: ప్రభుత్వ పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్ సమర్పణకు జనవరి 1 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ లోపు ఆన్‌లైన్లో నమోదు చేసుకోవాలని, లేని పక్షంలో ఏప్రిల్ నుంచి పెన్షన్ నిలుపుదల చేస్తామని జిల్లా ఖజానా అధికారి వి.ఎల్.సుభాషిణి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నర్సింగరావుపేట ఏపీటీఎఫ్ భవనంలో జాతీయ పింఛనుదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెన్షనర్ల పితామహుడు డి.ఎస్.నకారా చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలో పెన్షనర్లు వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ట్యాక్స్ చెల్లించాలని కోరారు. పెన్షనర్ల సమస్యలు ఉన్నట్లయితే తమ కార్యాలయంలో దిగువ స్థాయి సిబ్బందిని కలిసి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం 80 సంవత్సరాలు పైబడిన 10 మంది పెన్షనర్లను సంఘం సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వద్దాది జగన్నాథరావు, కార్యదర్శి బి.ఎల్.ఎన్.శర్మ, కోశాధికారి కె.సత్యారావు, గౌరవాధ్యక్షుడు కె.సుబ్రహ్మణ్యం, విశ్రాంత డిప్యూటీ డీఈవో కె.వి.గౌరీపతి, ఉడ్‌పేట యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎ.గోవిందరావు, పింఛనుదార్లు పాల్గొన్నారు.

న్యాయంపూడి సర్పంచ్‌కు హోం మంత్రి అభినందన



సర్పంచ్ వరహాలును అభినందిస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి: ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర ప్రభుత్వ అవార్డు అందుకున్న న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలబాబును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మంగళవారం అభినందించారు. తన నియోజకవర్గ పరిధిలో ఉన్న న్యాయంపూడి పంచాయతీ దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ శతత్ వికాస్ పురస్కారానికి ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందని అనిత అన్నారు. పంచాయతీలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. మిగతా పంచాయతీలు కూడా న్యాయంపూడిని స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆమె సూచించారు. సర్పంచ్‌తో పాటు ఎంపీడీవో సీతారామరాజు, కార్యదర్శి వర్మ, నర్సింహరాజులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీపీవో శిరీషారాణి, డీటీసీ నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చి'వరి'లో కలవరం

ఖరీఫ్ ప్రారంభం నుంచి ప్రకృతి రైతులతో దోబుచులాడుతోంది. మొదట్లో సకాలంలో వర్షాలు కురవక వరినాట్లు ఆలస్యంగా పడ్డాయి. ఆ తర్వాత నుంచి అడపాదడపా కురిసిన వర్షాలతో అనేక వ్యయప్రయాసలతో పండిన పంటను ఇంటికి సురక్షితంగా చేర్చుకుందామంటే, పది రోజులుగా తుపాను హెచ్చరికలతో కలవరం చెందుతున్నారు. అయినప్పటికీ కొంతమంది రైతులు తెగించి వరి కోతలు కోస్తున్నారు. మరికొంతమంది వాయిదా వేస్తూ వస్తున్నారు.



కోత కోస్తున్న రైతులు



మోపులతో వరి చేను తరలిస్తున్న కూలీలు

- తుపాను హెచ్చరికలతో కోతలు వాయిదా
- గింజ నేల రాలుతుందని ఆందోళన
- పంట కోస్తున్న మరికొందరు రైతులు



ఆగమేఘాలపై వరి కుప్పలు పెడుతున్న రైతులు

తుమ్మపాల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో వరి రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అనేక వ్యయప్రయాసలతో వరి పంటను కాపాడుకుంటూ వస్తున్న రైతులకు చివరిలోను **ప్రశాంతత** లేకుండా పోయింది. **పది రోజులుగా** తుఫాన్ హెచ్చరికలతో రైతులను భయాందోళనలకు గురిచేస్తున్న వాతావరణం మళ్లీ అవే వార్తలు రావడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దీంతో కోత దశకు వచ్చిన వరి పంటను సైతం కోత కోయకుండా కాపాడుకోవడం తలకు మించిన భారంగా మారింది. పొలాల్లోనే పంటను వదిలేద్దామంటే గింజ నేల రాలిపోతోందని వాపోతున్నారు. తెగించి వరి కోతలు కోద్దామంటే ఎక్కడ తడిచి పాడవుతుందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేల రాలుతున్న గింజ..

వ్యవసాయ ఆధారిత మండలంలోని అనేక గ్రామాల్లో అధిక సంఖ్యలో వరి రైతులు ఉన్నారు. సగానికి పైగా గ్రామాల్లో ప్రధాన పంటగా వరిని పండించి దిగుబడి పొందుతూ ఉంటారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ అనుకూలించక పోయినప్పటికీ మండలంలో దాదాపు 6,500 ఎకరాల్లో వరి పండించారు. వాటిలో 80 శాతం మేర వరి కోత దశకు చేరుకుంది. సరిగ్గా ఇదే సమయంలో వాతావరణ శాఖ నుంచి తుఫాన్ హెచ్చరికలు రావడంతో రైతులు పండిన పంటను కోత కోసే సాహసం చేయలేక గత పది రోజులుగా ఎదురు చూస్తున్నారు. దీంతో వరి గింజలు నేలపాలై తీవ్రంగా దిగుబడి తగ్గిపోతుందని వాపోతున్నారు.

రెండు రోజుల పాటు తుఫాన్ హెచ్చరిక....

నిన్నటి వరకు తుఫాన్ హెచ్చరికలు చెప్పడంతో వరి కోత వాయిదా వేసుకున్న రైతులకు మళ్లీ అవే హెచ్చరికలు రావడం మరింత ఆందోళనకు దారి తీసింది. దీంతో కోతను వాయిదా వేసినప్పటికి గింజ రాలిపోవడంతో సాహసం చేసి మరీ వరికోతలు చేపడుతున్నారు. మంగళవారం తుఫాన్ హెచ్చరికలు ఉన్నప్పటికీ వరి కోతలు ప్రారంభించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ పండిన వరి పంటను పాడుచేసుకోలేక రైతులు కోతలకు సిద్ధమయ్యారు.

ఆగమేఘాల మీద కోతలు



తుఫాన్ హెచ్చరికలతో వారం రోజులుగా కోత వాయిదా వేస్తున్నాం. కాని ఎటువంటి తుఫాన్ రాలేదు. కేవలం వాతావరణ శాఖ హెచ్చరికలనే నమ్ముకుంటూ కోతలు నిలిపివేసుకుంటే గింజ పూర్తిగా రాలిపోతోంది. పది రోజులుగా ఎదురు చూస్తున్నా వర్షాలు రాలేదు. చాలా సమయం వృథా అయింది. అందుకే పండిన వరిని ఆగమేఘాల మీద కోతలు చేపడుతున్నాం. వాతావరణం బాగుంటే వెంటనే కుప్పలు పెట్టుకునేందుకు సిద్ధపడుతున్నాం.

– శానాపతి సాయి, రైతు, తుమ్మపాల

వేగంగా కుప్పలు పెడుతున్నాం



ప్రభుత్వం తుఫాన్ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఎటువంటి వర్షాలు పడలేదు. దీంతో రెండు రోజుల క్రితమే కోతలు పూర్తి చేసి మంగళవారం కుప్పలు పెడుతున్నాం. పండిన పంటను కాపాడుకునేందుకు కూడా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వరి పంటను పనలుగా ఉంచకుండా వెంటనే కుప్పలుగా పెట్టుకుంటే ఎటువంటి ఆందోళన ఉండదు.

– మంత్రి వరహాలు, రైతు, రేబాక గ్రామం

చిరుజల్లులతో రైతుల ఆందోళన



బయ్యవరంలో మడిలో ఆరేసిన వరి పనలు

కశింకోట: మండలంలోని వరి రైతులు తుపాను ప్రభావంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తుపాను వల్ల మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉండటమే కాకుండా సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. రానున్న నాలుగు రోజులు తుపాను ప్రభావంతో వర్షాలు కురవనున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో మరింత ఆందోళన చెందుతున్నారు. గతంలో వచ్చిన రెండు తుపానుల సమయానికి పంట పూర్తిగా పండలేదు. ఇప్పుడు దాదాపుగా పంట పండి చేతికి వచ్చే స్థితిలో ఉంది. చాలా వరకు కోతలు కోసి పనలను మడుల్లో ఆరబెట్టారు. కశింకోట, వెదురుపర్తి, బయ్యవరం, పరవాడపాలెం, జమాదులపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, తదితర గ్రామాల్లో పండిన పంట మడుల్లో ఉంది. ఇప్పుడు వర్షాలు ప్రారంభం కావడంతో తమ పంటకు ఎటువంటి నష్టం కలుగుతుందోనని మదన పడుతున్నారు. వాతావరణ సమాచారం తెలియని కొందరు, బాగా పండిన వెన్నుల నుంచి ధాన్యం రాలిపోతున్న వారు కోతలను కోసుకుంటుండగా, సమాచారం తెలిసిన వారు కోతలను వాయిదా వేసుకుంటున్నారు. అది కూడా వర్షాలు ఎక్కువ స్థాయిలో పడితే పంట దెబ్బతినే పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రోలుగుంట: మండలంలోని కొండపాలెం పంచాయతీ శివారు వెలంకాయలపాలెం సరిహద్దులో పేకాడుతున్న వారిపై మంగళవారం ఎస్ఐ పి.వెంకట్రావు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 18,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

సంతోషిమాత హుండీ ఆదాయం రూ.51 వేలు



కానుకల లెక్కింపులో ఈవో రాజా సులోచన, ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కర్

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సంతోషిమాత అమ్మవారు ఆలయ హుండీ ఆదాయం 93 రోజులకు రూ.51,656 వచ్చినట్లు ఈవో రాజా సులోచన మంగళవారం తెలిపారు. హుండీ కానుల లెక్కింపు కార్యక్రమం విశాఖ దేవదాయ శాఖ ఇన్స్పెక్టరు బి.వసంత్ పర్యవేక్షణలో జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు, ధర్మకర్తలు బుద్ద ఈశ్వరరావు, ఆళ్ల రవికుమార్ పాల్గొన్నారు.

మహిళా ఉద్యమ నేతకు ఘన నివాళి



శారద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కశింకోట: ఆలిండియా సీఐటీయూ జనరల్ కౌన్సిల్ మాజీ సభ్యురాలు, కార్మిక, మహిళా ఉద్యమ నేత డి. శారద వర్ధంతిని కశింకోటలో మంగళవారం నిర్వహించారు. ఐద్వా ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలకు, కార్మికులకు అందించిన సేవలను ప్రస్తుతించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: నూతలగుంటపాలెం శివారులో అక్రమంగా తరలిస్తున్న 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వీటిలో పది క్వార్టర్ సీసాలు, మిగిలినవి బీరు సీసాలు ఉన్నాయన్నారు. గ్రామానికి చెందిన కె. రామచంద్రరావుపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు...

అనకాపల్లి: స్థానిక కొత్తూరు జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, కశింకోట మండలం కొత్తపల్లికి చెందిన చిన్నబాబు వద్ద 11 మద్యం క్వాటర్ సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ మంగళవారం చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 5,640 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	5,140
మొదటి రకం	3,440	4.380
రెండో రకం	3,150	3,800
మూడో రకం	3,000	3,150

అనకాపల్లి సినిమాలు

పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
సన్ని	: పర్తిసాయి
మిస్‌యూ	: షిర్డీసాయి
జీబ్రా	: వెంకటేశ్వర
ప్రణయ గోదావరి	: శ్రీసత్య
పుష్ప-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 30 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-7 యూనిట్లు, ఓ పాజిటివ్-14 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 378 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 343 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు



గవరపేటలో మత్స్యావతారంలో వేంకటేశ్వరస్వామికి అలంకరణ



ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

కశింకోట: స్థానిక ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు రెండో రోజు మంగళవారం నిర్వహించారు. దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వేకువ జామున విష్ణు సహస్ర నామార్చన, తిరుప్పావై పారాయణం నిర్వహించారు. ఆండాలమ్మ వారిని సంప్రదాయంగా స్థానిక కోమటి వీధిలో తిరువీధి నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామిని విష్ణు దశావతారాల్లో మొదటిదైన మత్స్యావతారంలో అలంకరించి పూజలు నిర్వహించారు. తిరుప్పావై పఠనం చేశారు. మహిళలు మేలు కొలుపు భజన కార్యక్రమాన్ని, నాదస్వరాన్ని నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు, అర్చకుడు సుబ్రహ్మణ్యంల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ధ్యాన వేంకటేశ్వరస్వామి మందిరంలో మత్స్యావతారంలో స్వామివారికి విష్ణు సహస్ర నామార్చన, తిరుప్పావై పారాయణ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోనూ అర్చకుడు అత్తిలి కోదండపాణి ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు నిర్వహించారు.

అయ్యప్పస్వామి చిత్రపటం ఊరేగింపు



అయ్యప్పస్వామి పల్లకి ఊరేగిస్తున్న భక్త బృందం

కశింకోట: నరసింగబిల్లి నూకాంబిక అయ్యప్పస్వామి పీఠం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి చిత్రపటాన్ని పల్లకిలో మంగళవారం ఘనంగా ఊరేగించారు. నూకాంబిక ఆలయం నుంచి అయ్యప్పస్వామి నామస్మరణతో భజన పాటలు పాడుతూ ప్రారంభించిన ఊరేగింపు కార్యక్రమం నరసింగబిల్లితోపాటు చింతలపాలెం, జెట్టపురెడ్డితుని గ్రామాల్లో ఉత్సాహంగా సాగింది. గురుస్వామి జెర్రిపోతుల నూకినాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కోన నాగేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఘటాల ఊరేగింపు



ఘటాలు ఊరేగింపులో భక్తులు

అనకాపల్లి: పట్టణంలో గ్రామదేవతల ఉత్సవాలను నిర్వహించే సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, భక్తులకు ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ కోరారు. మంగళవారం స్థానిక గాంధీబొమ్మ జంక్షన్‌లో మోదకొండమ్మ జాతర పురస్కరించుకుని భక్తులతో అమ్మవారి ఘటాలను పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆయన మాట్లాడుతూ అమ్మవారు ఉత్సవాన్ని పురస్కరించుకుని రోజూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల ధర్నా



జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

అనకాపల్లి: జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు బకాయిపడ్డ వేతనాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జోనల్ పరిధిలోని వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు ఈ నెల 17వ తేదీ వచ్చినప్పటికీ చెల్లించలేదన్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులు 450 మంది ఉండగా, 200 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని వాపోయారు. కొత్తగా నియమించిన 15 మంది కార్మికులకు ఎనిమిది మాసాలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. వారం రోజుల్లో బకాయిపడ్డ కార్మికుల జీతాలను తక్షణమే చెల్లించాలని, లేని పక్షంలో సమ్మె నోటీస్ ఇస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎర్రంశెట్టి శివ, నాయకులు నిమ్మకాయల అజయ్, ఎర్రంశెట్టి ఏసురాజు, నాగరాజు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు ఘన సత్కారం



కశింకోటలో సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు సత్కారం

కశింకోట: స్థానిక ప్రమీలా తోటలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల పితామహుడు డీఎస్ నకారా చిత్రపటానికి కశింకోట విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పాము సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ విశ్రాంత ఉద్యోగులు డి.వి.ఎస్.ఆర్. మూర్తి, వానపల్లి సత్యారావు, డి.వి.ఎస్.ఎన్. సత్యనారాయణమూర్తిలకు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి కె. గోపాలరావు దుశ్శాలువాలు కప్పి సత్కరించి గౌరవించారు. సూర్యనారాయణ, గోపాలరావులను కూడా పి. నాగేశ్వరరావు దుశ్శాలువాలతో సత్కరించారు. గుమ్మడి సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది కార్యక్రమంలో కుర్చీలాట, నడక, షూటింగ్ పోటీలు నిర్వహించారు. విశ్రాంత ఎంఈవో నంబా రమణ, విశ్రాంత ఉపాధ్యాయుడు కె. కామేశ్వరరావుల ఆధ్వర్యంలో విజేతలకు జ్ఞాపికలు, బహుమతులను అందజేశారు. విశ్రాంత ఉద్యోగులు రాళ్లపల్లి సుందరరావు, తగరంపూడి గణపతి, సింహాచలం, ఉమామహేశ్వరరావు, శోభ, కరణం సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి



మాట్లాడుతున్న ఎస్ఐ రాములమ్మ

అనకాపల్లి: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ సీడీపీవో టి.శశికళ తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక విజయరామరాజుపేట మాధవ సదన్ హాల్లో కిశోర వికాసం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 11-18 సంవత్సరాల పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు గ్రామాల్లో ఐదుగురు సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులు గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు, మహిళలపై లైంగికదాడుల నివారణకు కృషి చేస్తుందన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాములమ్మ మాట్లాడుతూ చట్టాలపై ప్రతి వ్యక్తి అవగాహన కలిగి ఉన్నప్పుడు నేరాలను నియంత్రించవచ్చన్నారు. చదువుతో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే కాకుండా మానవుని జీవనశైలిలో మార్పులు సంభవిస్తాయన్నారు. సీడీపీవో పి.ప్రభావతి, న్యాయవాది కుసుమ, సీడ్ ఆర్గనైజర్ ప్రతినిధి చిన్నారావు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కన్నూరుపాలెంలో రోడ్డుకు మరమ్మతులు



కన్నూరుపాలెం కూడలిలో రోడ్డుకు మరమ్మతులు



గతంలో ఎగసి పడే దుమ్ము, ధూళి (ఫైలు)

సాక్షి ఎఫెక్ట్..

కశింకోట: సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. కన్నూరుపాలెంలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. చదును చేశారు. దుమ్ము, ధూళి బెడద తప్పింది. దీంతో ప్రజలు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కన్నూరుపాలెం కూడలిలో గోతులు పడి దుమ్ము, ధూళి ఎగసి పడుతుండటం, ప్రమాదాలకు గురవుతుండటం, నిధులు మంజూరైనా పనులు చేపట్టకుండా జాప్యం చేస్తుండటంతో ప్రజలు, వ్యాపారులు, వాహన చోదకులు పడుతున్న ఇబ్బందులపై 'కన్నీరుపాలెం' శీర్షికన ఈ నెల 12న సాక్షి కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి అనకాపల్లి-నర్సీపట్నం మార్గంలో కన్నూరుపాలెం కూడలిలో రోడ్లు, భవనాల శాఖకు చెందిన రోడ్డు భారీ వాహనాల తాకిడికి తరచూ దెబ్బతిని పడిన గతుకులను పూడ్చారు. తారు వేసి చదును చేశారు. దీంతో ప్రజలు, వాహన చోదకులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అంగరంగ వైభవంగా పడమటమ్మ ఉత్సవం



కస్పావీధిలో పడమటమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు



పడమటమ్మ వారికి పూలమాలలతో అందంగా అలంకరణ



చేసిన పడమటమ్మ మేడను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు

కశింకోట: పడమటమ్మ ఉత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక కస్పావీధిలోని అమ్మవారి ఆలయాన్ని భక్తులు ఉదయం నుంచి దర్శించుకుని పూజలు చేశారు. భర్నీలో బంతిపూల నడుమ పురుగు రూపంలో ఉన్న అమ్మవారి నిజ రూపాన్ని తిలకించి భక్తి పారవశ్యంతో మునిగిపోయారు. చీరలు, రవికెలు, అరటి గెలల రూపంలో అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవం గ్రామం అంతటా అమ్మవారి పల్లకి ఊరేగించారు. ఉత్సవం పురస్కరించుకొని అరటి గెలలు, వ్యవసాయ ఉత్పత్తులతో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన పడమటమ్మ మేడను భక్తులు ఆసక్తిగా తిలకించి ఆనంద పరవశులయ్యారు. తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు బంధించారు. సాయంత్రం అమ్మవారి లక్కీ డిప్ డ్రా తీసి విజేతలను ప్రకటించి బహుమతులను అందజేశారు. అమ్మవారిని ఊరేగించడానికి పల్లకి సమకూర్చిన తగరంపూడి గణపతిని ఉత్సవ కమిటీ తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సిదిరెడ్డి శ్రీనివాసరావు, దాసరి బాబు, కలగా శివానందం, సూరా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

జి. భీమవరం రోడ్డు గుంతలు పూడ్చివేత



లాలంకొత్తూరు వద్ద గోతులు పూడ్చివేత పనులు

కశింకోట: మండలంలోని జి. భీమవరం-కన్నూరుపాలెం ఆర్అండ్‌బీ రోడ్డుకు పలుచోట్ల పడిన గండ్లను పూడ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా మరమ్మతుల నిర్వహణకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. దీనిలో రూ. 3 లక్షలు జీఎస్టీ పోనూ మిగిలిన నిధులతో మరమ్మతులు తాజాగా చేపట్టి నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అడ్డాం, లాలం కొత్తూరు, ఆనందపురం, కన్నూరుపాలెం ప్రాంతాల్లో భారీ వాహనాల వేగం తాకిడికి దెబ్బతిని రోడ్డుకు పడిన గండ్లను పూడుస్తున్నారు. తారు వేసి గండ్లు పడిన చోట తాత్కాలికంగా పూడుస్తున్నారు. దీనివల్ల మళ్లీ వర్షం పడితే గతుకులు పడి వాహనదారులు యధావిధిగా తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందని, దీన్ని శాశ్వత ప్రాతిపదికన రోడ్డు బాగు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 9966329167, 9912440601

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
✆ 9010973030, 9010546644, 9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com